సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023

SAKSHI PREMIER LEAGUE

ఉత్సాహం ఉరకలు.. జోరుగా పరుగులు


'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. - 8లో▸



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి శనివారం బోడపాటి రవిశంకర్, భార్గవి దంపతులు(భీమవరం) రూ.50,116 విరాళం అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,895 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2030, మధ్య డెల్టాకు 1325, పశ్చిమ డెల్టాకు 3540 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

రాజధాని విషయంలో కట్టుబడి ఉన్నాం : సోము వీర్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీకి **అమరావతే** రాజధాని అని తమ పార్టీ స్పష్టం **చేసిందని** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము **వీర్రాజు** అన్నారు. శనివారం స్థానిక బీజేపీ **కార్యాలయం**లో జరిగిన సమావేశంలో ఆయన **మాట్లా**డుతూ రాజధాని అనే విషయంలో **బీజేపీ కట్టు**బడి ఉందన్నారు. అధికారం **ఇస్తే ఐదేళ్లలో** అమరావతిలో రాజధాని **నిర్మాణం పూర్తి** చేస్తామన్నారు. రాజధాని కడతానన్న **సీఎం** జగన్ మడమ తిప్పారన్నారు. గత **టీడీపీ ప్రభు**త్వానికి రాజధాని కోసం ఇచ్చిన **రూ. 9 వేల** కోట్లు ఏమయ్యాయో **తెలియదన్నారు.** వైఎస్సార్ సీపీ, టీడీపీలను తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. విశాఖను రూ.రెండు లక్షల కోట్లతో కేంద్రం అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న ఆయిల్ ట్యాంకర్

ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు ప్రయాణికులకు తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆటో, వెనుక కొద్ది దూరంలో ఉన్న ఆయిల్ ట్యాంకర్

రాజానగరం: స్థానిక ఏడీబీ రోడ్డులో వెంకన్నపేటకు సమీపంలో శనివారం సాయంత్రం ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో అటు రంగంపేట, ఇటు రాజానగరం వైపు వాహనాల రాకపోకలు కొద్దిసేపు స్తంభించిపోయాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. రంగంపేట నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఆటోను గోకవరం సమీపంలోని గుమ్మళ్లదొడ్డి నుంచి ఆయిల్ లోడుతో వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ రాజుతో పాటు అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో ముందు భాగం తుక్కుతుక్కు అవడంతో రాజు రెండు కాళ్లు ఇరుక్కుపోయాయి. అటుగా ప్రయాణించేవారు, స్థానికులు కలిసి శ్రమించి అతడిని బయటకు తీశారు. గాయపడిన ముగ్గురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజానగరం పోలీసులు ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వస్తుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిందన్నారు. 16న నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. మార్చి 13న ఓటింగ్, 16న లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు.

పాదగయను దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

పిఠాపురం/అన్నవరం: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యాం సుందర్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నిర్వహణ చేయలేకపోతున్నాం



పెద్ద భవంతుల్లో ఉండడం అదృష్టంగా భావిస్తాం. కానీ వీటి నిర్వహణ మాత్రం చాలా కష్టతరంగా మారింది. టేకు గుమ్మాలు, కిటికీలు కావడం వల్ల ఎప్పటికప్పుడు పాలిష్ పెట్టించాల్సి ఉంది. ఇళ్ల నేత కార్మికుల కొరత ఎక్కువగా ఉంది. కూలీలు దొరకడం లేదు. చెదల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

- కంచిపల్లి రాజు, అమలాపురం

మున్ముందు కష్టమే



మండువా లోగిలి మన వారసత్వ సంపద. మన సంస్కృతి, జీవన విధానంలో భాగం. ప్రస్తుత రోజుల్లో వీటి నిర్వహణ చాలా భారంగా మారింది. అయినా వెనకడుగు వేయకుండా మా తరం వాళ్లం కాపాడుకుంటూ వస్తున్నాం. కానీ మున్ముందు నిర్వహణ కష్టమే.

- మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, లక్కవరం, మలికిపురం మండలం

కొత్త ఇల్లు కట్టాలనుకుంటున్నాం



మా ఇల్లు కట్టి 55 ఏళ్లు పూర్తవుతుంది. 1998లో ఒక వాటాను మానాన్నగారు కొన్నారు. అప్పటి నుంచి పరిరక్షిస్తూనే ఉన్నాం. ఈ మధ్య గోడలు బీటలు వారుతున్నాయి. పాతగోడలు కావడంతో సిమెంటుతో మరమ్మతులు చేయటం కష్టంగా ఉంది. ఎంత మరమ్మతులు చేసినా ఏదో వెలితి కనిపిస్తూనే ఉంది. దీన్ని పడగొట్టి కొత్త ఇల్లును నిర్మించే ప్రయత్నంలో ఉన్నాం.

- నూకల నారాయణరుషి, ఉప్పలగుప్తం



అమలాపురం నల్లా వీధిలో మండువా లోగిళ్లు

మండువా లోగిలి.. ఓ అందమైన జ్ఞాపకం



అమలాపురం మండలం పేరూరులోని పెంకుటిల్లు

- ఉమ్మడి కుటుంబాలకు ఆతిథ్యమిచ్చిన నివాసాలు
- ఆధునిక పరిస్థితుల్లో కనుమరుగవుతున్న వైనాలు
- కుటుంబం చిన్నదై.. నిర్వహణ భారమై ఉనికి కోల్పోతున్న మండువా లోగిళ్లు

సండే స్పెషల్

శతమానం భవంతి సినిమా చూశారు కదూ.. సీతారామయ్య గారి మనవరాలు సినిమా గుర్తుంది కదూ.. ఈ సినిమా నేపథ్యంలో కనిపించే మండువా లోగిళ్లు తప్పకుండా గుర్తుండే ఉంటాయి. పాత తరం వారికి పరిచయమక్కరలేని మమతల నిలయాలివి. ఈతరం వారికి ఆశ్చర్యం కలిగిస్తూ ఆనందం నింపే ఈ అందాల లోగిళ్లకు ఇప్పుడు పెద్ద కష్టమొచ్చింది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం.. ఆధునికత ప్రభావం ఫలితంగా ఉనికి కోల్పోయే పరిస్థితులెదురవుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరీ ముఖ్యంగా కోనసీమలోని కొన్ని పల్లెల్లో రాజమహల్‌ను తలపించే ఈ ఇళ్లు ఇప్పుడు రాన్రానూ కనుమరుగవుతున్నాయి. నిర్వహణ కష్టతరమై ఉనికి కోల్పోతున్నాయి.

- దెన్కు, రాజమహేంద్రవరం

ఒకప్పుడు గ్రామీణ వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రస్తుతం చిన్నదైపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే విచ్ఛిన్నమైపోయింది. వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకునేవారు కొందరు.. వ్యవసాయానికి దూరంగా వెళ్లిపోతున్నవారు మరికొందరు.. ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణ బాట పడుతున్న వారు మరికొందరు. కారణాలేమైతేనేం.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఒకనాటి జ్ఞాపకంగా మిగిలింది.. ఇంటికి ఇద్దరో ముగ్గురో ఉంటున్నారు. మహా అయితే నలుగురుంటున్నారు. **దీంతో నివాసాలూ కుచించుకుపోతున్నాయి. దీంతో ఊరిలో దర్పంగా నిలిచే మండువా లోగిళ్లు ఇప్పుడు చిక్కి శల్యమైపోతున్నాయి. జమీందారీ** వ్యవస్థకు, మోతుబరి రైతు కుటుంబాలకు చిహ్నంగా నిలిచే ఈ అందాల భవంతులు నెమ్మది నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి.

దాని వైభోగమే వేరు

18 అంగుళాల మందాన వెడల్పున గోడలు, నగిషీలు చెక్కిన సింహద్వారాలు, టేకుతో తయారు చేసిన సరంబీలు.. కిటికీలు. రాజులమహల్‌ను తలపించే చెక్క స్తంభాలు.. వెలుగు.. వెలుతురు పంచే మండువాలు.. పిరమిడ్‌ను తలపించే ఇంటి పైకప్పు.. కళాకృతి ఉట్టిపడే పెంకులనేత.. ఎత్తయిన అరుగులు.. కోట బురుజులంత గోడలు.. విశాలమైన ఆవరణ.. అందమైన పూలమొక్కలు.. చూడగానే మనసును దోచుకునే వైభోగం మండువా లోగిలి సొంతం. ఇప్పటికీ ఇలాంటివి కోనసీమ జిల్లాలోని అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, మలికిపురం లాంటి మండలాల్లో అక్కడక్కడ ఉనికి చాటుతున్నాయి. నాటి ఉమ్మడి కుటుంబాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

నిర్వహణ భారమై..

'వాళ్లకేంటి... లంకంత ఇల్లు' అని గోదావరి పల్లెల్లో చెప్పుకోవడం తరచూ వినేదే. కానీ ఇప్పుడు వాటి నిర్వహణ ఇంటి పెద్దకు భారమవుతున్నాయి. అంత పెద్ద ఇళ్లలో ఉండేది ఇప్పుడు ఒకరిద్దరే. రోజువారీ పరిశుభ్రం చేసేందుకు మనుషులు దొరకడం లేదు. వ్యవసాయానికే కూలీలు దొరకని పరిస్థితి. ఇవన్నీ గుర్తించి చాలా మంది మండువా లోగిళ్లను, వాటి ముందు నిర్మించిన పాత కాలం నాటి మేడలను తొలగిస్తున్నారు. వాటి స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా చిన్నచిన్న ఇళ్లను నిర్మించుకుంటున్నారు. వందల ఏళ్ల నాటి అనుబంధమే అయినా తప్పని పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తుందని ఈ భవనాల యజమానులు ఆవేదనా స్వరంతో చెబుతున్నారు. అక్కడక్కడ కొంత మంది ఆధునిక పద్ధతిలో మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ఇప్పటి అవసరాలకు అనుగుణంగా టైల్స్, సీలింగ్ వంటివి జోడిస్తున్నారు.

సినిమా షూటింగులక్కడే

గ్రామీణ కథా నేపథ్యంతో సాగే చాలా సిని**మాల్లో మం**డువా లోగిలి కనిపిస్తుంది. **అభిరుచి గల** నిర్మాతలు బోలెడు ఖర్చు భరించి **మరీ కోనసీమ** జిల్లాకు వస్తుంటారు. ఈ తరహా **ఇళ్లలో షూటిం**గులు చేస్తుంటారు. వీటిలో తీసే **సినిమాలు హి**ట్ అవుతాయని సినిమా రంగం**లో** సెంటిమెంటు ఉంది. నాటి నుంచి నేటి **వరకూ చాలా** చిత్రాలకు ఈ మండువా లోగి**లిలో షూటిం**గులు తీస్తున్నారు. ఈ సెంటిమెంటును నిజం చేస్తున్నారు.



కూనవరంలో రాజప్రాసాదాన్ని తలపించే మేడ, మండువా లోగిలి

ప్రతిభ ప్రకారమే పోలీసు ఉద్యోగాల భర్తీ

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో విలేకర్లతో మాట్లాడుతున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: మెరిట్ ఆధారంగానే పోలీసు కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. శనివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 6,100 కానిస్టేబుళ్ల పోస్టులకు ఇటీవలే ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. దీనిలో క్వాలిఫై అయిన అభ్యర్థులు మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మెరిట్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. మంత్రులు తెలుసుననో లేదా మరే ముఖ్య నాయకుని పేరు చెప్పినా విశ్వసించవద్దని కోరారు. జగనన్న పాలనలో అత్యంత పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ జరుగుతోందన్నారు. గతంలో సచివాలయాల్లో ఉద్యోగాల నియామకాలనూ పారదర్శకంగా నిర్వహించిన సంగతి గుర్తు చేశారు.

లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 43 బెంచ్‌లలో సుమారు 24,500 వందల కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సునీత సమక్షంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కె. సునీత మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలనే లక్ష్యంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కేసుల పరిష్కారానికి ఇన్సూరెన్స్ సంస్థలు, పోలీస్, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు సహకారం అందించాయన్నారు. వాహన ప్రమాదంలో మృతి చెందిన ముప్పకర్ల పద్మ కుటుంబ సభ్యుల పేర ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పరస్పర అంగీకారంతో రూ.9.5 లక్షల నష్ట పరిహారం నిర్ధారిస్తూ తీర్పు ఇచ్చామన్నారు. మరో వాహన ప్రమాదంలో బొబ్బరి పద్మ కుటుంబ సభ్యులకు రూ.14.35 లక్షల పరిహారం చెల్లించేలా రాజీ కుదుర్చుకున్నారన్నారు. లోక్ అదాలత్‌లో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎం నాగేశ్వరరావు, సీనియర్ జిల్లా జడ్జి డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఐ.శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లోని కోర్టుల్లో 43 బెంచ్‌లను ఏర్పాటు చేశారు.

15, 16 తేదీల్లో జిల్లా విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న విద్యాశాఖాధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ పాఠశాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో ఈనెల 15, 16 తేదీల్లో జరగనుంది. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం దీని ఏర్పాట్లను పరిశీలించారు. ఇందుకోసం కమిటీలను నియమించారు. మొదటి దశలో పాఠశాల స్థాయిలో 200 ప్రభుత్వ పాఠశాలలల్లో పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రతీ ఉప అంశం నుండి ఒక్కొక్క అత్యుత్తమ ప్రాజెక్టు ఎంపిక చేశారు.

రెండో దశలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన 19 మండలాలలో నిర్వహించారు. ప్రథమ స్థానం పొందిన సుమారు 100 ప్రాజెక్టులను మూడో దశ కింద జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన ప్రాజెక్టులను నాలుగో దశలో ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారు.

మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.నెహ్రూ (ఫోన్: 9490351351)ను సంప్రదించవచ్చు. అర్బన్ డీఐ బి.దిలీప్‌కుమార్, రూరల్ ఎమ్ఈవో డి.తులసీదాస్, ఇతర అధికారులు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిక్కిరిసిన రత్నగిరి

- ఆలయ ప్రాంగణంలో నవ దంపతుల సందడి
- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన నవదంపతులు



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిట లాడింది. స్వామివారి సన్నిధిలో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున 150కి పైగా వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత మండపాలు, విశ్రాంత మండపాలు నవ దంపతులు, వారి బంధు మిత్రులతో కిక్కిరిసిపోయాయి. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. దేవస్థానం ఘాట్‌రోడ్లు, పార్కింగ్ స్థలాలు పెళ్లిబృందాల కార్లతో నిండిపోయాయి. పలు మార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పశ్చిమ రాజగోపురానికి వెళ్లే రోడ్డులో మళ్లీ గోతులు తవ్వి రాకపోకలను నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 4,750 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 50 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో కారం తమ్మన్నదొర మృతదేహం

గోకవరం: గోకవరం శివారు ఇందిరమ్మ మోడల్ కాలనీ వద్ద శనివారం బైక్‌ను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ వివరాల ప్రకారం.. గంగవరం మండలం జీఎం పాలేనికి చెందిన కారం తమ్మన్నదొర(35) బైక్‌పై లోతుపాలెం వెళుతుండగా ఇందిరమ్మ మోడల్ కాలనీకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న దుంపల లోడు వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన తమ్మన్నదొర అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై యూవీ శివనాగ బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

వ్యాపారి కుటుంబం అదృశ్యంపై కేసు

పెదపూడి: తిరుపతి యాత్రకు బయలు దేరిన ఓ వ్యాపారి కుటుంబం అదృశ్యమైంది. పెదపూడి ఎస్సై పి.వాసు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జి.మామిడాడ గ్రామానికి చెందిన మల్లుల్లె రాధాకృష్ణ అతని భార్య వరలక్ష్మి, కొడుకులు రమేష్, ఉదయభాస్కర్, కోడళ్లు పావనీ, నవీన, మనుమరాళ్లు హిషికా, మహికా మొత్తం ఎనిమిది మంది ఈ నెల 4న తిరుపతి యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఇంతవరకూ ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. జి.మామిడాడ మెయిన్ రోడ్డులో ఆదినారాయణ వస్త్ర దుకాణాన్ని రాధాకృష్ణ నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు అతని బంధువు మల్లుల్లె గణేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. అప్పులు తీర్చలేక రాధాకృష్ణ కుటుంబం పరారీ అయినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఎస్సైను వివరణ కోరగా అప్పులకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డీఈఓల బదిలీ

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం.కమలకుమారిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈమె విజయవాడలోని సమగ్ర శిక్షా, ఎస్పీడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత డీఈవో ఎస్వీ రవిసాగర్ ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయంలో ప్లానింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టరు కేఎస్‌వీఎస్ అన్నపూర్ణను కాకినాడ డీఈవోగా నియమితులయ్యారు.

ఉత్సాహం ఉరకలు.. జోరుగా పరుగులు

SPL SAKSHI PREMIER LEAGUE

- ప్రారంభమైన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ స్థాయి క్రికెట్ పోటీలు
- జూనియర్స్, సీనియర్స్ విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, తూర్పుగోదావరి

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి'ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు ఈ టోర్నీలో పోటీపడ్డాయి. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించేందుకు ఆదివారం సీనియర్స్ విభాగంలో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టుతో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తలపడనుంది. జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టుతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టు పోటీ పడనుంది.

ఐదు వికెట్ల తేడాతో..

సీనియర్స్ విభాగంలో జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ ఓడిన ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల(శొంఠ్యాం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. ఓపెనర్ సునీల్ 39 పరుగులు చేశాడు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు (విజయనగరం) రెండు వికెట్లు కోల్పోయి 8.1 ఓవర్లలోనే విజయ లక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ రవికుమార్ 38 పరుగులతో నిలిచాడు.

హోరాహోరీ పోరులో..

జూనియర్స్ తొలి మ్యాచ్‌లో సాయి గణపతి పాలిటెక్నిక్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లకు 84 పరుగులు చేసింది. నూకేష్(56) ఎనిమిది ఫోర్లతో అర్ధ సెంచరీ చేశాడు. సతీష్, గౌతమ్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఆర్‌కే జూనియర్ కళాశాల (పార్వతీపురం) జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయగలిగింది. చిరంజీవి 33, సంజయ్ 23 పరుగులు చేశారు. తేజ, లోకేష్ చెరో వికెట్ తీశారు.

లక్ష్యసాధనలో..

జూనియర్స్ రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(పలాస) ఐదు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. సాయికృష్ణ 45 పరుగులు చేశాడు. చరణ్‌సాయి రెండు, యశస్వి ఓ వికెట్ తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ కళాశాల (పెద్దాపురం) జట్టు ఏడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ సూర్య దిలీప్ 47 పరుగులు చేశాడు. వాసు, యుగంధర్ చెరో వికెట్ తీశారు.

అర్ధసెంచరీ తేడాతో..

సీనియర్స్ విభాగం రెండో మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు నాలుగు వికెట్లకు 121 పరుగులు చేసింది. సాయి యశ్వంత్(60) ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ చేయగా షరోన్ 45 పరుగులు చేశాడు. రవికుమార్, వంశీ చెరో వికెట్ తీశారు. ప్రతిగా ఐడియల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(కాకినాడ) జట్టు మూడు వికెట్లు కోల్పోయి 70 పరుగులే చేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సూర్య చైతన్య 41 పరుగులు చేశాడు. యశ్వంత్ రెండు వికెట్లు తీశాడు.



ఎంవీజీఆర్ కళాశాల, విజయనగరం



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం



సాయిగణపతి పాలిటెక్నిక్, విశాఖపట్నం



అర్ధ సెంచరీ చేసిన సాయి యశ్వంత్

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో సాగాలి



అండర్-14 టీం చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం పొందిన కాకినాడ బాలుర జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన కాకినాడ బాలికల జట్టు

ఆర్జేడీ నాగమణి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి అన్నారు. శనివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14 ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభించారు. ఆర్జేడీ నాగమణి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి పాఠశాలలో క్రీడా సదుపాయాలను నాడు-నేడు పథకంలో మెరుగుపరుస్తుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలలో రాణించి తమ జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ అండర్-14 విభాగంలో జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు, రూరల్ ఎంఈఓ గణేష్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పోటీలు జరిగాయి. టీ చాంపియన్‌షిప్ విభాగంలో గుంటూరు, కాకినాడ, విశాఖలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఆల్ రౌండ్ చాంపియన్ షిప్‌లో కె.శివగణేష్ (కాకినాడ), వీసీపీ విఘ్నేష్ (గుంటూరు), ఎస్‌కే ముఫాసిర్ అహ్మద్ (గుంటూరు) మొదటి మూడు స్థానాలు పొందారు. టీం చాంపియన్ షిప్ బాలికల విభాగంలో గుంటూరు ప్రథమ, కాకినాడ ద్వితీయ, కర్నూలు తృతీయ స్థానాలు సాధించాయి. ఈ కార్యక్రమంలో అండర్-19 కార్యదర్శి తాతబ్బాయి, పీడీలు రవిరాజు, బంగార్రాజు, సింహాద్రిరావు, శ్రీను, వెంకటేశ్వరరావు, స్వామి, మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం పేరుతో బెదిరింపులు

ఇద్దరిపై కేసు నమోదు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శివగణేష్, చిత్రంలో ఎస్ఐ అశోక్

మండపేట: సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ, గృహ నిర్మాణదారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిపై మండపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఒకరిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్టు సీఐ పెద్దిరెడ్డి శివగణేష్ తెలిపారు. ఎస్సై ఎం.అశోక్‌తో కలసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ వివరాల ప్రకారం.. స్థానిక శాలిపేటకు చింతల వీర ప్రసాద్ తన భవనంపై మొదటి అంతస్తు నిర్మించుకుంటున్నాడు. పట్టణానికి చెందిన గాడు సత్యనారాయణ, హుస్సేన్‌లు ఆ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఫొటోలు తీశారు. తమకు రూ.మూడు లక్షలు ఇవ్వాలని లేకుంటే స.హ. చట్టం ద్వారా ఇంటి నిర్మాణం జరగకుండా నిలిపి వేయిస్తామంటూ బెదిరించారు. దీంతో వీరప్రసాద్ భయపడి రూ.50 వేలు ఇచ్చాడు. మిగిలిన డబ్బు కోసం చంపుతామని బెదిరిస్తూ నిందితులు వేధిస్తుండడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం సత్యనారాయణను అరెస్టు చేశామని, హుస్సేన్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. గాడు సత్యనారాయణపై మండపేట పోలీస్ స్టేషన్‌లో 16 కేసులు, రౌడీషీట్ ఉన్నాయన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని త్వరలో అతనిపై పీడీ యాక్టు నమోదు చేయనున్నట్టు వివరించారు. మరో నిందితుడు హుస్సేన్ ఓ దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్నాడన్నారు. కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకునే వారిని స.హ. చట్టం పేరుతో బ్లాక్ మెయిలింగ్ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. తమకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు సత్యనారాయణ ఈ నెలలో 10 ఆర్‌టీఐలు పెట్టారని, గత ఏడాది 49 పెట్టాడన్నారు. ఇప్పటి వరకూ అతను సుమారు వెయ్యి స.హ. చట్టం ద్వారా ఫిర్యాదులు చేసినట్టు సీఐ వివరించారు. బాధితుల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయని, కొందరు రూ.లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకూ వీరికి ఇచ్చినట్టు చెప్పారన్నారు. నిందితులకు ఇంకా ఎవరైనా డబ్బులు ఇచ్చి ఉంటే ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, అన్నివిధాలా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని అన్నారు.

సాగునీటి పనులకు రూ.11.74 కోట్ల మంజూరు



డెల్టా కాలువ నుంచి మోటార్‌తో నీటి తోడకం (ఫైల్)

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టా పరిధిలో రబీ సాగుకు నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్‌ఎం) పనులకు నిధులు మంజూరు చేసింది. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని 161 పనులను రూ.14.28 కోట్లకు ప్రతిపాదించగా, ప్రభుత్వం 154 పనులకు రూ.11.74 కోట్ల నిధులు మంజూరు చేసింది. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, కాకినాడ జిల్లా పరిధిలో పెద్దాపురం, కాకినాడ, ఏలూరు సర్కిల్ పరిధిలో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సబ్ డివిజన్‌లో ఈ పనులకు నిధులు మంజూరయ్యాయి. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో 110 పనులకు రూ.8,38,35,000, ఏలూరు సర్కిల్ పరిధిలో 44 పనులకు గాను రూ.3,36,55,000 నిధులు ఇచ్చారు. ఆయా నిధులతో పూర్తిగా రబీ సాగుకు నీరందించేందుకు అవసరమైన పనులు చేపట్టనున్నారు. మురుగునీటి కాలువపై క్రాస్ బండ్‌లు, మోటార్లతో నీటి తోడకం, పంట కాలువలపై చేపట్టే పనులకు ఈ నిధులు కేటాయించనున్నారు.

బావిలోకి దూకిన యువకుడు

ఆచూకీ కోసం గాలింపు



మిర్తిపాడులో బావి వద్ద గుమిగూడిన జనం

సీతానగరం: మిర్తిపాడులో బావిలోకి ఓ యువకుడు దూకగా ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్సై కె.శుభశేఖర్ కథనం ప్రకారం.. మిర్తిపాడు శివారులో మద్దిపాటి వీరన్నచౌదరికి చెందిన ఏభై ఏళ్ల నాటి బావిలోకి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి పరుగున వెళ్లి దూకాడు. మూడు అడుగుల ఎత్తున్న బావి గోడను మామూలు గోడగా భావించి దూకాడు. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు అక్కడకు వెళ్లి చూడగా ఎటువంటి ఆచూకీ తెలియలేదు. ఎర్ర రంగు టీషర్టు, షార్ట్ వేసుకుని 30 ఏళ్ల వయసు కలిగిన యువకుడని చూసిన వారు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై శుభశేఖర్ తన సిబ్బందితో వచ్చి బావిని పరిశీలించగా అందులో పెద్ద మొక్కలు పెరిగి ఉన్నాయి. శనివారం ఉదయం మత్స్యకారులను బావిలోకి దింపి చూసినా ఫలితం లేదు. ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ పురాతనమైన బావి 90 అడుగుల మించి లోతుగా ఉందని, ఇంజిన్లతో నీటిని తోడాలంటే సాధ్యపడని విధంగా మొక్కలు పెరిగి ఉన్నాయని తెలిపారు. రెండు రోజుల్లో మృతదేహం పైకి తేలుతుందన్నారు. వీఆర్వో నామాల రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.